క్లుప్తంగా

పరామర్శ



బుల్లిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ రాజేష్

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోర బుల్లి బాబు ఇటీవల ప్రమాదవశాత్తు పడిపోవడంతో చేయి విరిగింది. రాజాంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న ఆయన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహన్‌రావు, కెల్ల మన్మధరావు,తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తును పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణదొర

బాడంగి: మండలంలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ స్థానిక ఎమ్మార్సీలో గత వారం రోజులుగా చురుగ్గా జరుగుతోంది.ఎస్‌జీటీలకు సంబంధించిన బదిలీల దరఖాస్తులను ఎంఈఓ పి.లక్ష్మణ దొర సోమవారం పరిశీలించారు. స్కూల్‌అసిస్టెంట్లకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ ఈనెల 23వ తేదీ తో ముగిసిందని, మొత్తం 51 దరఖాస్తులు వచ్చాయని ఎంఈఓ చెప్పారు. ఎస్‌జీటీలు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27తో గడువు ముగియనుందని, ఎస్‌జీటీల నుంచి ఇప్పటి వరకు 49 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. వీటిని పరిశీలించి తప్పులుంటే సరిదిద్ది డీఈఓ కార్యాలయానికి పంపిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్ర మంలో సీఆర్‌టీలు,ఎల్‌డీఏ కల్యాణి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించండి



అధికారులతో సమావేశమైన సీఐ చిన్నంనాయుడు

బాడంగి: మండలంలో సారా నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని, బొబ్బిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు కోరారు. నవోదయం 2.0 కార్యక్రమంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సోమవారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాడంగిని నాటు సారా రహిత గ్రీన్ మండలంగా తీర్చిదిద్దుదామని అన్నారు. మండలంలో25 గ్రామ పంచాయతీల్లో సారా లేదని, వాటిని సారా రహిత పంచాయతీలుగా చేసేందుకు తీర్మానాలు చేశామన్నారు. అనంతరం అధికారులంతా కలిసి మండలాన్ని సారా రహిత మండలంగా చేసేందుకు తీర్మాణం చేశారు. తహసీల్దార్ కె.సుధాకర్, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, ఎస్ఐ తారకేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్ఐ బి.రాముడు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న ఏఓ నవీన్

సంతకవిటి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు కావాలిస్న రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో వివరాలను నమోదు చేసుకోవాలని ఏఓ పైల నవీన్ సూచించారు. మండలంలోని మంద రాడ గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ పంటల సాగుపై అవగాహ న కల్పించారు. వరిలో ఇంద్ర, స్వర్ణ మసూరి, సాంబ మసూరి, అమర, తదితర రకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులందరికీ విత్తనాలు అందజేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి



మహిళలకు సూచనలు చేస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: డ్వాక్రా సంఘాల్లోని సభ్యులంతా ఆర్థికంగా బలోపేతం కావాలని వెలుగు ఏపీఎం బి.గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. చిరువ్యాపారాలు చేస్తూ స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక పరిపుష్టి సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతీ నెల క్రమం తప్పకుండా బ్యాంకులకు రుణాలు చెల్లించాలని సూచించారు.

నాడు సంక్షేమ జాతర..
నేడు పథకాలకు పాతర

- సంక్షేమ పథకాలను అమలు చేయని కూటమి ప్రభుత్వం
- సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురు చూస్తున్న ప్రజానీకం
- పింఛన్ల తొలగింపే తప్ప... కొత్త పింఛన్లు మంజూరు కాని వైనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా సంక్షేమ పండగే
- రామభద్రపురం మండలంలో సంక్షేమం,అభివృద్ధికి గత ప్రభుత్వం ఖర్చు చేసింది సుమారు రూ.600 కోట్లు



రామభద్రపురం సచివాలయం, రైతుభరోసాకేంద్రం

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అయిదేళ్లు సంక్షేమ జాతర సాగింది. అభివృద్ధి, సంక్షేమానికి గత ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇచ్చింది. కరోనా వంటి కష్ట కాలంలోనూ సంక్షేమాన్ని కొనసాగించింది.సంక్షేమ పథకాలతో నాడు ఇంటింటా పండగ చేసుకున్న ప్రజానీకానికి నేడు కూటమి ప్రభుత్వం షాకిస్తోంది. కూటమి అధికారంలోకి వస్తే రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూ, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో నాటి ప్రతిపక్ష నేత,ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఊకదంపుడు ప్రసంగాలు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోలేదు. పెంచిన పింఛన్ తప్ప ఏ పథకాలను అమలు చేయడం లేదని, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలండర్ల పథకం ప్రారంభమైనప్పటికీ అరకొర గానే అమలు జరుగుతోందన్న విమర్శలు అధికంగానే వినిపిస్తున్నాయి. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడంతో ప్రజలకు చిర్రెత్తుకొస్తోంది. కూటమి ప్రభుత్వం తీరుపై మహిళలు దుమ్మెత్తిపోస్తున్నారు. పథకాలు అమలు కాకపోవడంపై అంతా చర్చించుకుంటూ, గత ప్రభుత్వ పాలనను గుర్తు చేసుకుంటున్నారు. జగనన్నే సీఎంగా ఉంటే ఈ పాటికి ఏదో ఒక పథకం పేరిట తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేసేవారని మహిళలు చర్చించుకుంటున్నారు.

రూ.600 కోట్లతో సంక్షేమం,అభివృద్ధి..

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మండలంలో 2019 నుంచి 2024 వరకు వివిధ సంక్షేమ పథకాలు,అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.600 కోట్లు ఖర్చుచేశారు. మండలంలో 17 గ్రామ సచివాలయాల పరిధిలో అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమథకాలు అందాయి. అవసరమైన చోట రహదారులు, డ్రైనేజీలు, అలాగే ప్రతీ 2 వేల జానాభాకు సచివాలయ,రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలు నిర్మించారు. నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేశారు. జగనన్న అమ్మ ఒడి, డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, చేయూత, ఆసరా, చేదోడు,వైఎస్సార్ బీమా, వైఎస్సార్ కల్యాణమస్తు, రైతు భరోసా, పంట బీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ,వాహనమిత్ర,వైఎస్సార్ కాపునేస్తం వంటి పథకాలతో జగన్ ప్రభుత్వం పేద వర్గాలకు అండగా నిలించింది. కోవిడ్ సమయంలో సైతం ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజల చేతిలో డబ్బులు ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు రాకపోగా మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరిగిందని వ్యాపారవర్గాలే ఢంకా మోగించి చెబుతున్నాయి.కూటమి నేతల మాయమాటలు నమ్మి మోసపోయామంటూ ప్రజానీకం గొగ్గోలు పెడుతున్నారు.

ప్రభుత్వం ఉందా అనే ప్రశ్నతో ప్రజలున్నారు..



రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అని ప్రజలు తమను తాము ప్రశ్నించుకుంటున్నారు.కూటమి నేతల మాయమాటలు,బూటకపు హామీలు నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ప్రతినెలా పండగేనని, నేడు జగన్ ఇచ్చిన పథకాలను నిలుపుదల చేసిన కూటమి ప్రభుత్వం, తాము ఇస్తామన్న సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడంతో ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారు.ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు, అవగాహనతో అమలు చేయగలిగే హామీలనే ఇచ్చారని, కూటమి నేతలు మాత్రం అమలుచేయలేమని తెలిసినా ప్రజలను మోసం చేయడానికి కంకణం కట్టుకుని గద్దెనెక్కారు.జగన్ ఉంటే బావుండేదనే మాట మెజారిటీ ప్రజల్లో ఇప్పుడు కనిపిస్తోంది.

– శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే

అర్హులందరికీ పథకాలు అందించాం..



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందేవి. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో పింఛన్ తప్ప మరొక్క సంక్షేమ పథకం అమలు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి.

– చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీపీ, రామభద్రపురం

పేదలు అల్లాడుతున్నారు..



జగన్ ప్రభుత్వం హయాంలో అమలైన సంక్షేమ పథకాలు నేడు నిలిచిపోవడంతో పేదప్రజలు అల్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు ఎటువంటి పథకాలు అందడం లేదని బాహాటంగానే ప్రజలు విమర్శిస్తున్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకుంటే మంచిది.

– అప్పికొండ సరస్వతి, జెడ్పీటీసీ, రామభద్రపురం

నిరుద్యోగాన్ని పెంచుతున్న కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల సంఖ్యను పెంచుతోందని, ఉన్న ఉద్యోగాలు తీసేస్తుందని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజే ష్ ఆరోపించారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రేషన్ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) వాహనాల సేవలను నిలిపివేయడంపై మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ వాహనాల ఆపరేటర్లు రోడ్డున పడ్డారని, వీరికి ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ వాహనాల ద్వారా ప్రతీ ఇంటికి రేషన్ సరుకులు సక్రమంగా, సకాలంలో అందేవని, ఇప్పుడు పలుగ్రామాల్లోని ప్రజలకు రేషన్ కష్టాలు పుట్టుకొస్తాయని అభిప్రాయపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి రాష్ట్రంలో కృత్రిమ కష్టాలు, ఉద్యోగ కొరతను సృష్టిస్తోందని, ప్రజలను నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. కూటమి మోసాలకు యువత త్వరలోనే బుద్ధిచెబుతారని అన్నారు.

హామీలను తక్షణమే నెరవేర్చాలి



ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఆర్పీలు

రాజాం సిటీ: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను తక్షణ మే అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు సీహెచ్. రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు.స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ అసిస్టెంట్లు 20 రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. వీరి సమ్మెకు మెప్మా ఆర్పీలు సోమవారం మద్దతు తెలిపారు. ఈసందర్భంగా రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ గత 20 రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమ్మె చేస్తున్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చలనం లేనట్లు వ్యవహరించడం సరికాదని అన్నారు. చర్చలపేరిట వాయిదా వేస్తూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. సమాన పనికి సమానవేతనం అందించాలని, 15 ఏళ్ల సర్వీసు ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలని, సీనియార్టీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, స్వాతి, శారద, నరసింగరావు, అనీల్, దాసు, సత్యనారాయణ, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల సందర్శన



అంతకాపల్లిలో చెత్త కుండీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: అంతకాపల్లి, పొగిరి తదితర గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీల(చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు)ను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. కేంద్రాల పరిసరాలు, చెత్త కుండీలు, సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించారు. ఈసందర్భంగా క్లాప్ మిత్రలకు ఆయన పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించి, తడి, పొడి చెత్తను వేరు చేయాలని, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయాలని చెప్పారు.

విభిన్న ప్రతిభావంతుల ఓటింగ్ శాతం పెంచాలి



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ రామమోహనరావు

బొబ్బిలి: ఎన్నికల్లో తమ ఓటు హక్కును ఇతరుల వలే వినియోగించుకునేలా విభిన్న ప్రతిభావంతులు, అంగవైకల్యం కలిగిన ఓటర్లకు మరిన్ని సౌకర్యాలు కల్పించి వారి ఓటింగ్ శాతం పెంచే చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ జె.వి.ఎస్.ఎస్. రామమోహనరావు అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఆర్డీఓ కార్యాల యంలో ఏసీసీఏఈ సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎన్నికల డీటీలతో పాటు సంబంధిత కమిటీ సభ్యులకు ఆర్డీఓ పలు సూచనలు చేశారు. పోలింగ్‌కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్ చైర్లు, అవసరమైన ఇతర సౌకర్యాలను కల్పించాల్సి ఉందన్నారు. ఇప్పటికే సదుపాయాలు ఉన్న ప్రాంతాల్లో ఇతర అవసరాలను గుర్తించి సూచనలు చేయాలన్నారు. తద్వారా శారీరక, మానసిక వైకల్యం ఉన్న ఓటర్లను చైతన్యం చేసి ఓటు వేసేందుకు అన్ని వెసులు బాటు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎం.శ్రీను, ఎన్నికల ఉప తహసీల్దార్ బలివాడ గౌరీశంకర్, ఎంపీడీఓ పి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కాకాణి అరెస్టు కుట్రపూరితం

- కూటమి ప్రభుత్వ విధానాలు ఘోరాతి ఘోరం
- మాజీ ఎమ్మెల్యే శంబంగి ధ్వజం



మాట్లాడుతున్న శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: మాజీ మంత్రి,నెల్లూరు వైఎస్సార్‌సీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం, కుట్రపూరితమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమ మైనింగ్ కేసులో తప్పులు జరగలేదని మైనింగ్ శాఖ జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో తేలినా ఆ కేసులో ఏ-4గా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని చేరుస్తూ అరెస్టు చేయడం చూస్తే వైఎస్సార్‌సీపీ మూలాలపై దెబ్బకొట్టే ప్రయత్నాల్లో ఇదీ ఓ భాగమని సాక్షాత్తూ రాష్ట్ర ప్రజలే వ్యాఖ్యానిస్తున్నారన్నారు. వ్యక్తిగత ప్రయాణాల్లో భాగంగా కేరళ వెళ్లిన మాజీ మంత్రిని అరెస్టు చేయడం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందన్నారు. ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబు చెప్పలేక, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. అందుకే వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేస్తోందని, ఇది రెడ్ బుక్ రాజ్యాంగంలోని ఓ ఎపిసోడ్ అన్నారు. కూటమి నాయకుల మోసాలను నిలదీయగలిగే వారిని అణచివేసే కుట్ర లో ఇదో భాగమన్నారు. పేరున్న వారిని తగ్గించి ఆయా ప్రాంతాల్లో కూటమి నాయకులకు హైప్ ఇవ్వడం కోసమే సంబంధం లేని కేసుల్లో ఇరికిస్తున్నారన్నారు. కూటమి నాయకులు ఎన్ని కుట్రలు చేసినా, వైఎస్సార్‌సీపీపై, ఆ పార్టీ నాయకులపై ప్రజాభిమానం ఇసుమంతైనా తగ్గదన్నారు. కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను ప్రజలు భారీ మెజార్టీల తో గెలిపించుకుంటారని కుండ బద్దలుగొట్టారు. కూటమి నాయకుల బండారం బయటపడే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇటువంటి దుశ్చర్యలపై పునరాలోచించుకోవాలన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు అప్పగించొద్దు



ఆందోళన చేస్తున్న ఉత్తరాంధ్ర సాధనసమితి సభ్యులు

బొబ్బిలిరూరల్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థకు విక్రయించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని,దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవాలని, ఇది ఆంధ్రుల హక్కు అని అన్నారు. వేలాది మంది కార్మికులకు ఉపాధినిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని బహిరంగ మార్కెట్లో అమ్మకానికి పెట్టడం ఉత్తరాంధ్రుల ఆత్మగౌరవం మీద దెబ్బకొట్టడమేనని అన్నారు. అనంతరం తహసీల్దార్ ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర సాధన సమితి సభ్యులు రెడ్డి సత్యంనాయుడు, నారాయణరావు,తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర విజయవంతానికి ప్రణాళిక



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి మున్సిపల్ స్థాయి, వార్డు స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్, వార్డు స్థాయి అధికారులు, సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 9 మంది సెక్రటరీలను ట్రెనర్లుగా గుర్తించి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. వారికి యోగాపై ఈనెల 27న మాస్టర్ ట్రెయినీలుగా శిక్షణ ఇచ్చి, అనంతరం వారితో ప్రతీ వార్డులో 50 మందికి శిక్షణ ఇప్పించాలన్నారు. ఈనెల 30లోగా శిక్షణ పూర్తి చేసి, పోటీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. విజేతలను వారి స్థాయిలను బట్టి మున్సిపల్, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించాలని చెప్పారు. జూన్ 11న యోగా భ్యాసం, ర్యాలీ, జూన్ 21న సచివాలయ, మున్సిపల్ స్థాయిల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ప్రణాళికను పక్కాగా అమలు చేసే బాధ్యతను సిబ్బంది తీసుకోవాలని ఆదేశించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



వంగర: కె.కొత్తవలస శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రామభద్రపురం: రామభద్రపురంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వంగర: శనీశ్వర జయంతి సందర్భంగా సంగాంలోని సంగమేశ్వర ఆలయంతో పాటు కె.కొత్తవలస, కొప్పరవలస, బంగారువలస, ఎం.సీతారాంపురం గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో అర్చకులు పంచామృత, రుద్రాభిషేకాలు చేయించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

రామభద్రపురం: స్థానిక ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ,పార్వతుల కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు బాదంపూడి నాగబాబు శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై ఉంచి వేద మంత్రోచ్చరణల మధ్య కమనీయంగా కల్యాణం జరిపించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

యోగాతో ఆరోగ్యం, ప్రశాంతత



తెర్లాం: మానవహారంగా ఏర్పడిన అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజలు



బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో ర్యాలీ చేస్తున్న మండల అధికారులు, వివిధ శాఖల సిబ్బంది



బాడంగి: వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఎంపీడీఓ రామకృష్ణ



రామభద్రపురం: యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై చర్చిస్తున్న ఎంపీడీఓ రత్నం,తహసీల్దార్ సులోచనరాణి

బొబ్బిలిరూరల్/ తెర్లాం: రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని అధికారులు అన్నారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి పట్టణం, తెర్లాం మండల కేంద్రంలో అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అలాగే బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో, తెర్లాం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టీఓటీలకు మాస్టర్ ట్రెనీలు శిక్షణ ఇచ్చారు. పాఠశాలల పీడీలు, పీఈటీలు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి వేతనదారులతో యోగాసనాలు వేయించారు. బొబ్బిలిలో యోగా శిక్షకులు ఎం.ఈశ్వరవరప్రసాద్, తహసీల్దార్ ఎం.శ్రీను, ఎంపీడీఓ పి.రవికుమార్,ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి, తెర్లాంలో ఎంపీడీఓ రేగి రాంబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు..

బాడంగి: మండల కేంద్రలోని మంగళవారం ఉదయం యోగాపై అవగాహన ర్యాలీ, అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శిక్షణ తరగతులు నిర్వహించ నున్న ట్లు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాలీ, శిక్షణ తరగతులకు అన్ని శాఖల సిబ్బంది హాజరై జయప్రదం చేయాలని కోరారు. గ్రామ సచివాలయాల స్థాయిలో ప్రజలకు యోగాపై వారం రోజులపాటు శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసిన టీఓటీలకు నాలుగురోజులు మండల టీఓటీల ద్వారా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు.

రామభద్రపురంలో..

రామభద్రపురం: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రత్నం,తహసీల్దార్ సులోచనరాణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణ,ఎంఈఓ తిరుమలప్రసాద్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులు,వీఆర్‌ఓలతో సోమవారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం నిర్వహించనున్న యోగాంధ్ర ర్యాలీ, శిక్షణ తరగతులకు మండల,గ్రామ,సచివాలయ స్థాయి అధికారులతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు హాజరవ్వాలని కోరారు.